






ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం

# జనం ముచ్చట

గురువారం, సెప్టెంబర్ 17, 2026 | తెలంగాణ | పేజీలు : 4


## పేదల ఇళ్లపై సర్కార్...

# బుల్డోజర్





### పువ్వాడ అజయ్ ఫైర్

మొన్న వెలుగుమట్ల, నిన్న ప్రకాష్ నగర్...
నేడు శ్రీనివాస నగరా ?
పేదల ఇళ్లపై వరుసగా కూల్చివేతల కలకలం.. ప్రభుత్వ తీరుపై పువ్వాడ అజయ్ ఫైర్
"కూల్చివేతలు కాదు.. పేదలకు భరోసా ఇవ్వాలి"
శ్రీనివాస్ నగర్ బాధితులకు మాజీ మంత్రి మద్దతు...

**ఖమ్మం సిటీ (జనం ముచ్చట):** ఖమ్మం నగరంలో పేదల ఇళ్ల కూల్చివేతల అంశం మరోసారి రాజకీయ చర్చకు దారితీసింది. ప్రకాశ్ నగర్, వెలుగుమట్లలో చోటుచేసుకున్న ఇళ్ల తొలగింపు ఘటనలను మరవక ముందే ఇప్పుడు శ్రీనివాస్ నగర్‌లో కూడా పేదల ఇళ్ల కూల్చివేతకు రంగం సిద్ధం చేస్తున్నారంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు పువ్వాడ అజయ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. శ్రీనివాస్ నగర్ బాధితులకు ఆయన మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి విధ్వంసం, కూల్చివేతలు తప్ప మరో ఎజెండా కనిపించడం లేదని పువ్వాడ విమర్శించారు. పేదలకు గృహ భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం వారి ఇళ్లను తొలగించే పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు... 2లో..



### ప్రభుత్వానికి పేదల ఇళ్లపై...

# అక్కసు ఎందుకు?

### సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

2లో..

**పేదల ఇళ్లకు నోటీసులు ఇవ్వడం అప్రజాస్వామిక చర్య.....**

ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. శ్రీనివాస నగర్‌లో ప్రభుత్వం జీ.ఓ.58 ప్రకారం పట్టాలు మంజూరు చేయడంతో పేదలు ఇళ్లు నిర్మించుకుని దశాబ్దాలుగా అక్కడే నివసిస్తున్నారని తెలిపారు. అలాంటి కుటుంబాలకు ఇప్పుడు ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం అప్రజాస్వామిక చర్య అని విమర్శించారు. సీపీఎం జిల్లా కమిటీ ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు.

గత 45 సంవత్సరాలుగా శ్రీనివాస నగర్ ప్రజలు అనేక సమస్యల మధ్య




**ఖమ్మం సిటీ (జనం ముచ్చట):** ఖమ్మం నగర పరిధిలోని 27వ డివిజన్ శ్రీనివాస నగర్‌లో గత 45 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబాలకు జారీ చేసిన ఇళ్ల ఖాళీ నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పేదల ఇళ్లను తొలగించే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వమే వారి తరపున హైకోర్టులో పిటిషన్ వేసి న్యాయపరంగా పోరాడాలని కోరారు. శ్రీనివాస నగర్ నివాసితుల ఇళ్ల కూల్చివేతకు సంబంధించిన నోటీసులను నిరసిస్తూ సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో శ్రీనివాస నగర్‌కు చెందిన సుమారు 400 కుటుంబాల బాధితులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.కు వినతిపత్రం అందజేశారు....

# పేదల ఇళ్లపై సర్కార్ బుల్డోజర్..

**ప్రకాశ్ నగర్ ఘటన.. పేదల ఆవేదన...**

ఖమ్మం నగరంలోని ప్రకాశ్ నగర్ ప్రాంతంలో గతంలో చోటుచేసుకున్న ఇళ్ల కూల్చివేతల అంశాన్ని పువ్వాడ ప్రస్తావించారు. ఇళ్ల తొలగింపుతో బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయని, ఇలాంటి పరిస్థితులు మరో ప్రాంతంలో పునరావృతం కాకూడదని అన్నారు."ఒక పేద కుటుంబం ఎన్నో ఏళ్ల కష్టంతో నిర్మించుకున్న ఇల్లు కూల్చివేస్తే.. ఆ కుటుంబం భవిష్యత్తే ప్రశ్నార్థకమవుతుంది" అని పువ్వాడ పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు అవసరమే అయినప్పటికీ, వాటి పేరుతో పేద కుటుంబాల జీవన భద్రత దెబ్బతినకూడదని అన్నారు.....

**నాడు వెలుగుమట్ల...నేడు శ్రీనివాస్ నగర్ వంతా?**

2026 ఫిబ్రవరిలో ఖమ్మం నగర శివారులోని వెలుగుమట్ల వినోబా నగర్ ప్రాంతంలోని భూదాన్ భూములపై నిర్మించిన ఇళ్ల తొలగింపు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి విదితమే మొన్న వెలుగుమట్ల,నిన్న ప్రకాష్ నగర్ ఘటనలు మరవక ముందే ఇప్పుడు శ్రీనివాస్ నగర్‌లో పేదల ఇళ్ల కూల్చివేత అంశం తెరపైకి రావడం బాధిత కుటుంబాల్లో ఆందోళనకు కారణమైందని పువ్వాడ అన్నారు.

శ్రీనివాస్ నగర్‌లో నివసిస్తున్న కుటుంబాల పరిస్థితిని ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆయన కోరారు. అక్కడి ప్రజల వద్ద ఉన్న పత్రాలు, వారి నివాస కాలం, భూమికి సంబంధించిన హక్కులు, ప్రభుత్వ రికార్డులు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ఎలాంటి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. చట్టపరమైన సమస్యలు ఉంటే వాటిని చట్టబద్ధమైన మార్గంలో పరిష్కరించాలి తప్ప.. పేదల కుటుంబాలను ఒక్కసారిగా రోడ్డున పడేసే విధంగా చర్యలు తీసుకోవద్దని ఆయన అన్నారు....




**మేము "ఇళ్లు నిర్మించాం తప్ప కూల్చలేదు"..కూల్చివేతలే అభివృద్ధి కాదు...**

తాను మంత్రిగా ఉన్న సమయంలో ఖమ్మం నగరంలో పేదలకు ఇళ్ల పట్టాలు అందించడంతో పాటు, గృహ వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టామని పువ్వాడ అజయ్ కుమార్ గుర్తు చేశారు.పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడం తమ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం పేదల ఇళ్లను కూల్చివేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మిగిలిన ఘనతగా మారిందని విమర్శించారు.నగర అభివృద్ధి పేరుతో పేదల నివాసాలను తొలగించడం పరిష్కారం కాదని పువ్వాడ అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే సమయంలో ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు, ప్రభావిత కుటుంబాల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.అవసరమైన సందర్భాల్లో ప్రత్యామ్నాయ నివాసం, పునరావాసం, పరిహారం వంటి అంశాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు.....

**ఇళ్ల కూల్చివేత ఆలోచనను వెంటనే విరమించుకోవాలి....**

శ్రీనివాస్ నగర్‌లో పేదల ఇళ్ల కూల్చివేత ఆలోచనను వెంటనే విరమించుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావును పువ్వాడ కోరారు.పేదల సమస్యను రాజకీయ కోణంలో కాకుండా మానవతా దృక్పథంతో చూడాలని సూచించారు. ప్రకాశ్ నగర్, వెలుగుమట్ల తరహా పరిస్థితులు శ్రీనివాస్ నగర్‌లో పునరావృతం కాకుండా ప్రభుత్వం ముందుగానే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే శ్రీనివాస్ నగర్ బాధితులు చేస్తున్న పోరాటానికి తాము అండగా ఉంటామని పువ్వాడ అజయ్ కుమార్ స్పష్టం చేశారు. పేదల ఇళ్లను కూల్చివేయడం కాకుండా వారి సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు."పేదలకు ఇళ్లు ఇవ్వాల్సిన ప్రభుత్వం.. ఉన్న ఇళ్లను కూల్చే పరిస్థితి తీసుకురావద్దు. కూల్చివేతల కంటే పేదల జీవన భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి" అని పువ్వాడ పేర్కొన్నారు.ప్రకాశ్ నగర్, వెలుగుమట్ల ఘటనల నేపథ్యంలో ఇప్పుడు శ్రీనివాస్ నగర్ వ్యవహారం తెరపైకి రావడంతో ఖమ్మం నగరంలో పేదల ఇళ్ల రక్షణ, భూముల హక్కులు, ప్రభుత్వ చర్యలు,పునరావాసం అంశాలపై మరోసారి చర్చ మొదలైంది.....

---

# ప్రభుత్వానికి పేదల ఇళ్లపై...
# అక్కసు ఎందుకు?

(మొదటి పేజి తరువాయి)

జీవిస్తున్నారని తెలిపారు. తాగునీటి ఇబ్బందులు, కాలువలు, రోడ్లు, పారిశుద్ధ్య సమస్యలు ఉన్నప్పటికీ నిరుపేదలు తమ కష్టార్జితంతో ఇళ్లు నిర్మించుకుని అక్కడే జీవిస్తున్నారని పేర్కొన్నారు. రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవించే శ్రమజీవులే ఈ ప్రాంతంలో అధికంగా ఉన్నారని అన్నారు....

**పేదల ఇళ్లను తొలగించి..టింబర్ డిపోలను ఎందుకు వదిలేస్తున్నారు?**

నగర అభివృద్ధి, రహదారుల విస్తరణ పేరుతో నిరుపేదల ఇళ్లను ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తున్న అధికారులు, అదే ప్రాంతంలో కాలుష్యానికి కారణమవుతున్న టింబర్ డిపోలు, కట్టెల మండీలు, సా మిల్లులపై కూడా దృష్టి పెట్టాలని నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

శ్రీనివాస నగర్‌లోని టింబర్ డిపోలు, సా మిల్లుల నుంచి కొంతకాలంగా కాలుష్యం వెలువడుతోందని, ప్రజల ఆరోగ్యం, నగర పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని వాటిని నగర పరిధికి వెలుపలకు తరలించాలని కోరారు. వాటిని తరలించేందుకు తగిన ప్రత్యామ్నాయ ప్రాంతంలో ప్రభుత్వం వసతులు కల్పించాలని సూచించారు.సంబంధిత అధికారులు గతంలో వాణిజ్య సముదాయాలకు నోటీసులు జారీ చేసినప్పటికీ, వాటి తరలింపుపై చర్యలు తీసుకోకుండా పేదల ఇళ్లకు మాత్రమే నోటీసులు ఇవ్వడం ఎందుకని ఆయన ప్రశ్నించారు....






**400కు పైగా కుటుంబాలను నిరాశ్రయులను చేస్తారా?**

దశాబ్దాలుగా కష్టపడి సంపాదించిన డబ్బుతో ఇళ్లు నిర్మించుకున్న 400కు పైగా కుటుంబాలను ఏ ప్రాతిపదికన ఖాళీ చేయించాలని చూస్తున్నారని ప్రభుత్వాన్ని నున్నా నాగేశ్వరరావు ప్రశ్నించారు. ఇదే ప్రాంతంలో గతంలో ఇందిరమ్మ ఇళ్లు కూడా మంజూరయ్యాయని గుర్తుచేశారు.ప్రభుత్వమే జీ.ఓ.58 ద్వారా పేదలకు ఇళ్ల స్థలాలపై పట్టాలు ఇచ్చిన విషయాన్ని ఇప్పుడు ఎలా విస్మరిస్తారని ప్రశ్నించారు. నగర అభివృద్ధి పేరుతో వందలాది పేద కుటుంబాలను నిరాశ్రయులను చేయడం సరికాదన్నారు.

వెలుగుమట్ల ఘటనను పునరావృతం చేయొద్దు ఇటీవల వెలుగుమట్లలో పేదల ఇళ్లకు సంబంధించిన వివాదంలో జరిగిన పరిణామాలను ప్రభుత్వం గుర్తుంచుకోవాలని నున్నా నాగేశ్వరరావు అన్నారు. ప్రజా పోరాటాల నేపథ్యంలో ప్రభుత్వం వెనక్కి తగ్గి బాధితులకు ఇళ్లను నిర్మించి ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. అలాంటి పరిస్థితి శ్రీనివాస నగర్‌లో కూడా పునరావృతం కాకుండా ప్రభుత్వం ముందుగానే సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.

బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు సీపీఎం పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. అవసరమైతే న్యాయపరమైన పోరాటానికి కూడా ముందుండి బాధితులకు అండగా నిలుస్తామని తెలిపారు....

**ఈ విషయంపై త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం....**

శ్రీనివాస నగర్ పేదల ఇళ్ల సమస్యతో పాటు నగరంలోని టింబర్ డిపోలు, సా మిల్లుల తరలింపు అంశంపై త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు నున్నా నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తామని తెలిపారు.

అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్‌తో పాటు ఇతర కమ్యూనిస్టు పార్టీలు, ప్రజా సంఘాలు పేదల ఇళ్ల కూల్చివేతకు వ్యతిరేకంగా పోరాటానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు సహకరించినా, సహకరించకపోయినా బాధితుల తరపున సీపీఎం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.....

**బాధితులకు నష్టం జరగకుండా చర్యలు: కలెక్టర్...**

ధర్నా అనంతరం సీపీఎం నాయకులు అందజేసిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. స్వీకరించారు. ఈ విషయంలో బాధిత కుటుంబాలకు నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన వారికి భరోసా ఇచ్చినట్లు సీపీఎం నాయకులు తెలిపారు.ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి వందలాది కుటుంబాలను నిరాశ్రయులను చేయకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని నున్నా నాగేశ్వరరావు కోరారు. లేని పక్షంలో ప్రజల తరపున మరింత విస్తృత స్థాయిలో పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్, నాయకులు యర్రా శ్రీనివాసరావు, బొంతు రాంబాబు, మెరుగు సత్యనారాయణ, ఎస్.కె. సైదులు, భూక్యా శ్రీనివాసరావు, బండారు రమేష్, దొంగల తిరుపతిరావు, ఎం.ఏ. జబ్బార్, ఎస్.కె. నాగులు మీరా తదితరులు పాల్గొన్నారు.

## స్కీమ్ వర్కర్ల హామీలు అమలు చేయాలని డిమాండ్.. ఖమ్మంలో సామూహిక దీక్షలు ప్రారంభం

# ఆందోళనలను అక్రమ అరెస్టులతో అడ్డుకుంటారా?

**ఖమ్మం జిల్లా (జనం ముచ్చట):**
అసెంబ్లీ సమావేశాల సందర్భంగా తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళనలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్న స్కీమ్ వర్కర్లను అక్రమ అరెస్టులతో అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని సీఐటీయూ నాయకులు మండిపడ్డారు. ఎన్నికలకు ముందు, ఎన్నికల అనంతరం, అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఖమ్మంలో స్కీమ్ వర్కర్లు సామూహిక దీక్షలు చేపట్టారు.ఖమ్మం నగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బుధ వారం నిర్వహించిన సామూహిక దీక్షలను తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ నాయకులు కొల్లి సత్యనారా యణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ ప్రారంభించారు. దీక్షలో పాల్గొన్న వారికి దండలు వేసి సంఘీభావం తెలిపారు.

**అరెస్టులతో ఉద్యమాలను అడ్డుకోవడం సరికాదు...**
ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాదినేని రమేష్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, గ్రామపంచాయతీ కార్మికులు, మున్సిపల్ కార్మికులు తదితర రంగాల్లో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్ల సమస్యలను



ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అనుమతులు తీసుకుని శాంతియుతంగా ధర్నాలు, ఆందోళనలు చేపట్టేందుకు ప్రయత్నించిన కార్మికులను అడ్డుకోవడం, ముఖ్యంగా మహిళా కార్మికులను సైతం అర్ధరాత్రి అరెస్టులు చేయడం ఆందోళనకరమన్నారు. మహిళా కార్మికులను మహిళా పోలీసులు లేకుండా మగ పోలీసులతో అరెస్టు చేయడం, భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్య పద్ధతి కాదని ఆయన విమర్శించారు. ప్రజా ఉద్యమాలను అణచివేయాలని ప్రయత్నించిన గత పాలకులకు ఎదురైన పరిస్థితే ప్రస్తుత పాలకులకు కూడా ఎదురవుతుందని హెచ్చరించారు.

**ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్**
అంగన్‌వాడీ, ఆశా, గ్రామపంచాయతీ, మున్సిపల్ తదితర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా వారి ఆందోళనలను పోలీసు చర్యలతో అడ్డుకోవడం సమస్యకు పరిష్కారం కాద న్నారు. స్కీమ్ వర్కర్ల డిమాండ్లపై ప్రభుత్వం చర్చలు జరిపి తగిన నిర్ణయాలు తీసుకోవాలని, కార్మికులపై నిర్బంధ చర్యలు నిలిపివేయాలని వారు కోరారు.

**దీక్షలకు పలువురి సంఘీభావం...**

సామూహిక దీక్షలకు బోడేపూడి విజ్ఞాన కేంద్రం మేనేజర్ శ్రీనివాసరావు, ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు గడ్డం లింగమూర్తి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ముత్తమాల ప్రసాద్ తదితరులు హాజరై సంఘీభావం తెలిపారు.
ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి చలమాల విఠల్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా ఉపేందర్, శ్రామిక మహిళా కన్వీనర్ పిన్నింటి రమ్య, పెరుమాళ్లపల్లి మోహన్‌రావు, సహాయ కార్యదర్శులు శీలం నరసింహారావు, మల్లూరు చంద్రశేఖర్, జెల్లారపు మంగ, ముదాం శ్రీనివాసరావు, దోనోజు లక్ష్మయ్య, నవీన్‌రెడ్డి, బషీర్, బాధావత్ శ్రీను, పడకంటి మురళీ, పగిడికత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. స్కీమ్ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం సామూహిక దీక్షలను కొనసాగిస్తామని సీఐటీయూ నాయకులు తెలిపారు.....

# ఆర్టీసీ కార్మికులపై పెంచిన పనిభారం తగ్గించాలి

## ఖమ్మం డిపో వద్ద ఎస్‌డబ్ల్యూఎఫ్ ధర్నా



**ఖమ్మం (జనం ముచ్చట):**
తెలంగాణ ఆర్టీసీ కార్మికులపై పెంచిన పనిభారాన్ని వెంటనే తగ్గించాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో ఖమ్మం డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజ మాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని యూనియన్ నాయకులు ఆరోపించారు.ఎస్‌డబ్ల్యూఎఫ్ 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సీహెచ్.వి. రామయ్య స్మారక భవనం వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఖమ్మం రీజియన్ అధ్యక్షులు గుండు మాధవరావు అరుణ పతాకాన్ని ఆవిష్కరించగా, యూనియన్ ప్రతినిధులు పతాకానికి రెడ్ సెల్యూట్ చేశారు.....

**ఖమ్మం డిపో ఎదురుగా కార్మికుల ధర్నా.....**
అనంతరం ఖమ్మం డిపో వద్ద నిర్వహించిన ధర్నాకు గడ్డం వెంకటయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి మాట్లాడుతూ తెలంగాణ ఆర్టీసీలో యాజమాన్య విధానాల కారణంగా కార్మికులపై విపరీతమైన పనిభారం పెరుగుతోందని అన్నారు.
గత ఏప్రిల్‌లో కార్మిక సంఘాల ఐక్య పోరాటంలో భాగంగా జరిగిన మూడు రోజుల సమ్మె సందర్భంగా అన్ని సంఘాలతో చర్చించి కొన్ని సమస్యల పరిష్కారానికి యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. ఆ తర్వాత ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల (ఈడీ) కమిటీతో జరిగిన చర్చల్లో అంగీకరించిన 17 అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు,కార్మిక సమస్యలపై కింది స్థాయిలో కార్మిక సంఘాలతో చర్చించాలని ఈడీ స్థాయి అధికారులు సూచిస్తున్నప్పటికీ, డిపో, రీజియన్ స్థాయి అధికారులు మాత్రం సంఘాలతో చర్చించకుండా స్మార్ట్ షెడ్యూల్ పేరుతో అదనపు పనిభారాన్ని కార్మికులపై మోపుతున్నారని లింగమూర్తి ఆరోపించారు.

**రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు, పీఆర్సీ ఏరియర్స్ చెల్లించాలి**
రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కార్మికులకు రావాల్సిన 2017, 2021 పీఆర్సీ ఏరియర్స్ చెల్లించాలని కోరారు. అన్ని కేటగిరీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి సిబ్బంది కొరతను నివారించాలని డిమాండ్ చేశారు.
ఆర్టీసీకి నష్టాలు కార్మికుల వల్ల కాదని, అధికారుల అనాలోచిత నిర్ణయాలు, నిర్వహణ లోపాల వల్లే నష్టాలు వస్తున్నాయని లింగమూర్తి పేర్కొన్నారు. స్థానిక యాజమాన్యం కార్మిక సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్‌లో మరింత పెద్ద ఉద్యమానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు....

**మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి...**
రీజియన్ అధ్యక్షులు గుండు మాధవరావు, ఉపాధ్యక్షులు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి తోకల బాబు మాట్లాడుతూ ఖమ్మం రీజియన్‌లో కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు.హైదరాబాద్ సిటీలో అధికంగా రిక్వెస్ట్ స్టేజీలు ఏర్పాటు చేయడం వల్ల డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మహిళా ఉద్యోగులు రాత్రివేళల్లో కూడా విధులు నిర్వహిస్తున్నారని, వారి అవసరాలకు అనుగుణంగా అన్ని బస్టాండ్లలో కనీస సౌకర్యాలతో కూడిన రెస్ట్ రూములు కూడా లేవని పేర్కొన్నారు.ఫేర్ పెయిడ్ ఆదాయం వచ్చే డీలక్స్ సర్వీసులను కూడా రద్దు చేస్తున్నారని, ప్రజల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ఆయా సర్వీసులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు....

**డిపో సమస్యలపై వినతిపత్రం...**

ఖమ్మం డిపో కార్యదర్శి గుగ్గిళ్ల రోశయ్య మాట్లాడుతూ డిపోలో నెలకొన్న స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. పెంచిన సర్వీసుల వివరాలతో పాటు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్ సత్యనారాయణకు యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు.ఓటిపియమ్, ఓటీఈబీ, ఓవైఎస్టి, ఓజెకెఎమ్ సర్వీసులకు పెంచిన ట్రిప్పులకు అనుగుణంగా ఓవర్‌టైమ్ చెల్లించాలని లేదా సర్వీసులను యథాతథంగా కొనసాగించాలని కోరారు. ఇల్లందు రూట్‌లో స్పెషల్ ఆఫ్ డ్యూటీలను డే అవుట్‌లుగా మార్చడాన్ని నిలిపివేసి యథాతథంగా స్పెషల్ ఆఫ్ డ్యూటీలుగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్.వి. బాబు, ఓ. రాంబాబు, ఎస్.ఎస్. రామయ్య, జే.యు. చారి, పగిళ్లపల్లి నరసింహారావు, సీహెచ్. వీరయ్య, కె. వెంకన్న, ఐ. ముత్తయ్య, జి. వెంకటేశ్వర్లు, కె. శ్రీను, వీరేందర్ రావు, యస్వీ చారి, ఏ. శ్రీనివాసు, డి. నాగయ్య, రాజనాల నాగమల్లేశ్వరరావు, బి. సుధాకర్, ఎం. వసంత రెడ్డి, రంగా రామారావు, ఎం. వెంకటేశ్వర్లు, పి. విజయ్ కుమార్, కృష్ణమూర్తి, కె. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు..